సాక్షి విజయనగరం

శనివారం । 11 । అక్టోబర్ । 2025



దివ్యాంగులకు మళ్లీ పరీక్ష

పుట్టుకతోనో, ప్రమాదవశాత్తుగానో వైకల్యంతో జీవచ్ఛవాలుగా బతుకులు ఈడుస్తున్న విధి వంచితులు వారు.

- 8లో



పెదమానాపురం గ్రామస్తుల ధర్నా

పెదమానాపురం గ్రామస్తులకు రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో శుక్రవారం ఉదయం పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ధర్నా చేశారు.

- 8లో

రైతుపై టీడీపీ వర్గీయుల దాడి



టీడీపీ వర్గీయులు ఇష్టారాజ్యంగా దాడులకు తెగబడుతున్నారు. పంట పొలాల్లో వచ్చిన తగాదాలపై అక్కడితో ఆగకుండా ఇళ్లకు వెళ్లి మరీ దాడులకు పాల్పడుతున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

13న అప్రెంటిస్ షిప్ మేళా

విజయనగరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళాను ఈ నెల 13న నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ టి.వి.గిరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అప్రెంటిస్ షిప్ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. మ్యాట్రిక్స్ లేబొరేటరీ, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, జయభేరి ఆటోమోటివ్స్ లిమిటెడ్, శ్యాంసంగ్ ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్, ఎల్జీ, ప్రీమియం ఎనర్జీస్, క్యూస్షన్ టెక్నాలజీ వంటి సంస్థలు మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలతో ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణానికి హాజరు కావాలని సూచించారు.

పైడితల్లి జాతరకు అహంకారపు రంగు

- గ్రామదేవత పండగలో రాజకీయాలు హేయం
- జాతర నిర్వహణ పేరిట చందాల సంస్కృతి ఏంటి?
- జిల్లాకు చెడ్డపేరు తెచ్చేలా అధికార యంత్రాంగం పనితీరు
- శాసమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



విజయనగరం: సంప్రదాయాలను విస్మరించి ఆర్భాటాలు, అహంకారాలకు పెద్దపీట వేస్తూ పైడితల్లి జాతర నిర్వహించడం దారుణమని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. సంప్రదాయాలపై పదేపదే గుర్తుచేసిన ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు ఈ ఏడాది జాతరలో జరిగిన తప్పులపై ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. విజయనగరం ప్రదీప్‌నగరలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొత్స మాట్లాడారు. అందరం కలిసి జరుపుకునే అమ్మవారి పండగను కొందరి ప్రాపకం కోసం నిర్వహించడాన్ని తప్పుబట్టారు. ప్రతి ఏడాది నిర్వహించుకునే జాతరకు ఈ ఏడాది నిధులు సమీకరణ పేరిట చెడ్డపేరు తీసుకురావడం ఎవరికోసమని జిల్లా అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించారు. ఏటా అందుబాటులో ఉన్న నిధులతో నిర్వహించుకునే జాతరను కొత్తగా నిధులు సమీకరణ పేరిట హుండీలు ఏర్పాటు చేయడాన్ని శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఖండించారు. ఈ ఏడాది ఎమ్మార్వో కార్యాలయంలో ఓ హుండీ... ఆర్డీఓ కార్యాలయంలో ఓ హుండీ, ఎక్సైజ్ కార్యాలయంలో ఓ హుండీ, పోలీస్ స్టేషన్‌లో ఓ హుండీ, ఎంపీడీఓ కార్యాలయంలో ఓ హుండీతో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో హుండీలు పెట్టి నిధులు సేకరణ చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. వ్యవస్థలను కాపాడాల్సిన జిల్లా అధికారులు జాతరకు చెడ్డ పేరు తీసుకువచ్చారని ఆరోపించారు. కొందరు రాజకీయనాయకుల ప్రాపకం కోసం అధికారులు వంతపాడడాన్ని తప్పుబట్టారు. ప్రజాప్రతినిధులు వారి గొప్పలకోసం తప్పులు చేస్తుంటే కలెక్టర్, జిల్లా ఎస్పీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

పచ్చకామెర్ల గుప్పెట్లో గురుకుల విద్యార్థులు

- పదుల సంఖ్యలో పిల్లలకు జ్వరాలు
- పాఠశాలలకు ఇంకా సెలవులు
- తల్లిదండ్రులకు సైతం వైద్య పరీక్షలు
- మన్యంలో కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో విషజ్వరాలు, పచ్చకామెర్లు వచ్చి పిల్లల ప్రాణాలు హరిస్తున్న ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయింది. దాదాపు 611 మంది బాలికలు చదువుతున్న గురుకుల విద్యాసంస్థలో ఆగస్టు నెలలోనే వ్యాధి వెలుగు చూసినా అధికారులు, హాస్టల్ నిర్వాహకులు పెద్దగా పట్టించుకోకపోగా.. ఇది సహజమే... తగ్గిపోతుందిలే అనే ఉదాసీనతతో మెనూ నుంచి చికెన్ మాత్రం పెట్టడం మానేసి ఊరుకున్నారు. దీంతో ఆ వ్యాధి అలా ఒక్కొక్కరిగా వ్యాపిస్తూ ఇప్పుడు పదుల సంఖ్యలో విద్యార్థులు దాని గుప్పెట్లో చిక్కుకున్నారు.

అప్పుడే స్పందిస్తే... ఇంత జరిగేదా..?

గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మరణం, వందల మంది విద్యార్థులు ఆస్పత్రి పాలవ్వడానికి నిర్లక్ష్యమెవరది..? క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన ఐటీడీఏ అధికారులదా..? లేక పాఠశాల సిబ్బందిదా..? అని విద్యార్థుల తల్లిదండ్రులు ఐటీడీఏ అధికారుల తీరుపై మండి పడుతున్నారు. గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంట్ మూలకు చేరి సుమారు ఆరు మాసాలు గడుస్తోందని, మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయని, వాటి నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో ఆ సమీపంలోనే ఉన్న తాగునీరు బోరు, వంటశాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారు కావడంతో తమ పిల్లలు అనారోగ్యం బారిన పడ్డారని గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు నెలలోనే ఓ విద్యార్థినికి పచ్చకామెర్లు వచ్చినట్లు గుర్తించారు. అప్పుడే జాగ్రత్త పడితే ఇంత వ్యాప్తి చెందేది కాదు. గురుకులంలో విద్యను అభ్యసిస్తున్నది 611 మందికాగా, వీరందరికి ఉన్న మరుగుదొడ్లు 32 మాత్రమే. అవికూడా అధ్వానంగా ఉన్నాయి. వసతి గృహం గదుల్లో విద్యాభ్యాసం, పడుకోవడం, భోజనం చేయడం, వాడుకనీరు సైతం విద్యార్థులు సంచరిస్తున్న ప్రాంతంలోనే ఉండడంతో ఒక్క సారిగా విద్యార్థులు అనారోగ్యం బారిన పడినట్టు గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికీ స్పందించని వైనం

గురుకుల బాలికలకు హెపటైటిస్-ఏ సోకినట్లు చెప్పుకుంటున్నా ఇప్పటికీ అటు వైద్య ఆరోగ్యశాఖ గానీ, ఐటీడీఏ అధికారులు కానీ పూర్తిస్థాయిలో అధికారిక సమాచారం ఇవ్వడం లేదు. తాగునీటి కాలుష్యమా? లేదంటే పారిశుద్ధ్యలోపమా? ఆహారం వల్ల విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారా అన్నది పూర్తిస్థాయిలో అధికారులు తేల్చాల్సి ఉంది. తమ పిల్లలకు ఆరోగ్య భద్రత, ప్రాణ రక్షణ కల్పిస్తేనే చిన్నారులను పాఠశాలకు పంపిస్తామని గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.



గురుకుల పాఠశాల



కురుపాం గురుకుల బాలికల పాఠశాలలో తాగునీటి బోరు సమీపంలో ఉన్న మురుగునీరు



హాస్టల్ ఆవరణలో పేరుకుపోయిన మురుగునీరు

ఐటీడీఏ అధికారుల తీరుపై అసంతృప్తి..

ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను ఎప్పటికప్పుడు సంబంధిత డీడీ, ఏటీడబ్ల్యూఓలు పర్యవేక్షించాల్సి ఉంది. విద్యార్థులకు అందుతున్న మెనూ, ఆహారంలో నాణ్యత, ఆరోగ్యంపై పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ సంబంధిత వసతిగృహ సంక్షేమాధికారుల వద్ద చేతివాటం కారణంగా పర్యవేక్షణ పక్కదారి పట్టి అది విద్యార్థులకు శాపంగా మారిందని గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇప్పుడా చర్యలు..?

పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మృతి చెంది, మరో 160 మంది వరకు పచ్చకామెర్ల బారిన పడి ఆస్పత్రిపాలైతే కాని అధికార యంత్రాంగం స్పందించ లేదు. ఇంత తంతు జరిగిన తరువాత మాజీ ఉప ముఖ్య మంత్రి పాముల పుష్పశ్రీవాణి గురుకుల పాఠశాలను సందర్శించి సమస్యలను వెలుగులోకి తెచ్చిన తరువాత ఐటీడీఏ యంత్రాంగం స్పందించి మూలకు చేరిన ఆర్వో ప్లాంట్ స్థానంలో కొత్తది ఏర్పాటు, అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లకు బదులుగా వెంటనే ఫైబర్ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.

విద్యార్థుల మృతిపై ఎమ్మెల్యే స్పందించకపోవడం దురదృష్టకరం

ఇటీవల పచ్చ కామెర్లతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందినా కూత వేటులో ఉన్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి స్పందించకపోవడంపై గిరిజన సంఘాల నాయకులు భగ్గుమంటున్నారు. కేవలం కూటమి ప్రభుత్వ నాయకులు వచ్చినప్పుడు మాత్రమే విద్యార్థుల కుటుంబాలను పరామర్శకు రావడాన్ని విమర్శిస్తున్నారు. మృతుల కుటుంబాలకు ఎలాంటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం గానీ, ప్రకటించడం కానీ లేదని, అబద్ధపు ప్రచారాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా కనీసం నియోజకవర్గంలోని ఏ ఒక్క వసతి గృహాన్ని ఆమె సందర్శించలేదని, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు భవనాలు మంజూరైనా పూర్తి చేయని ప్రభుత్వం

కురుపాం గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినుల సౌకర్యార్థం అదనపు భవనాల నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాబార్డు నిధులు రూ.1.97 కోట్లు మంజూరు చేసి 2020లో పనులకు శ్రీకారం చుట్టింది. రూ.90 లక్షల ఖర్చుతో నిర్మాణ పనులు చేపట్టింది. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి చివరి దశలో ఉన్న భవన నిర్మాణాలను పూర్తి చేయలేక పోవడంతో విద్యార్థులకు వసతి సమస్యలు తీవ్రతరమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలోనే గురుకులానికి ఆర్వో ప్లాంట్‌ను మంజూరు చేసినా వాటి పర్యవేక్షణ సైతం గాలికి వదిలేశారు. దీంతో చిన్నారులు కలుషిత నీటి కారణంగా హెపటైటస్-ఎ బారిన పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, వందల మంది ఆస్పత్రి పాలయ్యారు.



చివరి దశలో నిలిచిన గురుకుల పాఠశాలలో అదనపు భవన నిర్మాణం

ఏడాదిన్నర పాలనలో గాలిలో విద్యార్థుల సంక్షేమం



కూటమి ప్రభుత్వ పాలనలో విద్యార్థుల సంక్షేమం కోసం చేసిందేమీ లేదనేది కురుపాం గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన సంఘటనలే నిదర్శనం. ఆ పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయకపోవడం, ఆర్వో ప్లాంట్ పాడైనా వెంటనే మరమ్మతు పనులు నిమిత్తం ముందస్తు నిధులు కేటాయించకపోవడం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి మృతి చెందిన విద్యార్థులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందివ్వాలి. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.

– తోట జీవన్న, సీపీఐ (ఎంఎల్)రెడ్ స్టార్ జిల్లాకార్యదర్శి

ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలు కొనసాగించాలి

- ఉద్యోగ, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



ప్రైవేటు విధానాన్ని రద్దు చేయాలని ఐక్యతగా నినదిస్తున్న ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు

బొబ్బిలి: ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలు కొనసాగించాలని వివిధ ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బొబ్బిలి ఎన్‌జీఓ హోంలో శుక్రవారం జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పి.సత్యంనాయుడు అధ్యక్షతన ప్రభుత్వ వైద్య కళాశాలల ఆవశ్యకతపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసే పీపీపీ విధానాన్ని విరమించుకోవాలని ప్రభుత్వాన్ని ముక్తకంఠంతో కోరారు. జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.శివానంద్ మాట్లాడుతూ వైద్య రంగం నుంచి తప్పుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య విద్యను దూరం చేసే పీపీపీ చర్యలను వెనుకకు తీసుకోవాలన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్ జేసీ రాజు మాట్లాడుతూ కొత్తగా ప్రారంభిస్తున్న 17 మెడికల్‌కాలేజీల్లో 10 కాలేజీలను పీపీ ద్వారా కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నం ప్రజావ్యతిరేకమన్నారు. ఇది అభివృద్ధి తిరోగమన చర్యగా పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు పి.ధనుంజయ్, డి.వెంకటనాయుడు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యవిద్యను దూరం చేసే ఈ చర్యను వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలో ఉన్నప్పుడే ప్రజలకు వైద్యం, వైద్యవిద్య అందుబాటులో ఉంటాయన్నారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వి.ప్రసన్నకుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పొట్నూరు శంకరరావు మాట్లాడుతూ నిర్మాణదశలో ఉన్న వైద్య కళాశాలల నిర్మాణాన్ని పూర్తిగా ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. నిధులు లేవనే కారణాన్ని సాకుగా చూడకూడదన్నారు. విలువైన ప్రజాధనాన్ని, ఆస్తులను ప్రైవేటు పరం చేయడం అంటే అభివృద్ధి నిరోధానికి గేట్లెత్తేయడమేనన్నారు. అనంతరం మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్మించాలని, పీపీపీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, ఇతర వైద్య కళాశాలలను బలోపేతం చేయాలని నినదించారు. ఈ అంశాలను తీర్మానిస్తున్నట్టు జేవీవీ నాయకులు స్వామినాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాము, సీఐటీయూ నాయకులు లక్ష్మి, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు కె.కృష్ణదాసు, సుధాకర్, మహేష్, పి.సత్యనారాయణ, శ్రీనివాస్, శివ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బోధనేతర పనుల బహిష్కరణకు పిలుపు

బొబ్బిలి రూరల్: ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలను శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్టు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు తెలిపారు. కొయ్యికొండవలస పాఠశాలలో ఫ్యాప్టో ప్రతినిధులతో కలిసి శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మితి మీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయుల బోధనాసమయం హరించుకు పోతోందని, బోధనపై ఆసక్తి తగ్గుతోందని తెలిపారు. బోధనేతర పనుల వల్ల విద్యార్థులు నష్టపోతున్న విధానాన్ని పలుమార్లు ప్రభుత్వానికి తెలియజేసినా స్పందన లేనందున బహిష్కరణ నిర్ణయం తీసుకున్నామన్నారు. విద్యార్థుల హాజరు తప్ప మరే కార్యక్రమాలను చేపట్టబోమని స్పష్టంచేశారు. సమావేశంలో మండల ఫ్యాప్టో నాయకులు వి.రాజేష్, వై.పైడిరాజు, ఆర్.పోలినాయుడు, సీహెచ్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు..!



ఈమె పేరు ఎం. పంకజాక్షి. గంట్యాడ మండలం పెదమజ్జిపాలెం. గత నెల 27న ఆమెకు విజయనగరంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో నరాల సంబంధిత వ్యాధికి శస్త్రచికిత్స జరిగింది. తదుపరి చికిత్స కోసం శుక్రవారం ఆస్పత్రికి వచ్చారు. ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ)కి సంబంధించిన సేవలు నిలిపివేశాం. ఓపీ చూడడం లేదని అక్కడ సిబ్బంది చెప్పడంతో ఆందోళన చెందుతూ వెనుదిరిగారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు దొంతల అప్పన్న. సాలూరు మండలం జన్నివలస గ్రామం. ప్రమాదవశాత్తు పడిపోవడంతో మక్క విరిగింది. శుక్రవారం విజయనగరం తిరుమల మెడికవర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశామని చెప్పడంతో చేసేది లేక ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పోయారు.

- అవస్థలు పడుతున్న రోగులు
- నెట్‌వర్క్ ఆస్పత్రులకు వచ్చి వెనుదిరుగుతున్న రోగులు
- నెట్‌వర్క్ ఆస్పత్రులకు కోట్లాది రూపాయలు చెల్లించని కూటమి సర్కారు
- తదుపరి చికిత్స కోసం వచ్చేవారికి తప్పని తిప్పలు
- కొంతమంది సొంత డబ్బులతో వైద్యం

విజయనగరం ఫోర్ట్:

ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ) పథకం సేవలను ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు నిలిపివేశాయి. ఆరోగ్యశ్రీ సేవలకు బకాయిలు చెల్లించాలంటూ సమ్మెను తలపెట్టాయి. దీంతో రోగులకు పథకం సేవలు అందడం లేదు. కొంతమంది డబ్బులు వెచ్చించి వైద్యం చేయించుకోగా, మరి కొంతమంది ప్రభుత్వాస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

తప్పని తిప్పలు...

ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స చేయించుకున్న వారు, శస్త్రచికిత్స చేసుకున్న వారు తదుపరి చికిత్స కోసం సంబంధిత నెట్‌వర్క్ ఆస్పత్రికి వస్తారు. అటువంటి వారికి కూడా వైద్య సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఓపీ సేవలను కూడా డబ్బులు చెల్లించి పొందాల్సి వస్తోంది. బకాయిలు చెల్లించకపోతే పథక సేవలను నిలిపివేస్తామని ప్రైవేటు నెట్ వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు పలు సార్లు కూటమి ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. బకాయిల చెల్లింపునకు చొరవ చూపలేదు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపన్నిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో ప్రైవేట్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఇలా..

జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం సేవలు అందిస్తున్న ఆస్పత్రుల్లో అభినవ్, కొలపర్తి, సాయి పీవీఆర్, సాయి సూపర్ స్పెషాలటీ, వెంకటరామ, ఆంధ్ర, మారుతి, పీజీ స్టార్, స్వామి ఐ, నెఫ్రోప్లస్, మిమ్స్, మువ్వ గోపాల, కాస్వి, క్వీన్స్ ఎన్ఆర్ఐ, గాయత్రి, పుష్పగిరి, తిరుమల మెడికవర్, శ్రీనివాస్ నర్సింగ్ హోమ్, పిలిడోపియా, అమృత, సంజీవిని, శ్రీ బాపూజీ, సంజీవిని సూపర్ స్పెషాలిటీ, సాయి కృష్ణ, విజయ మల్టీ స్పెషాలటీ, వెంకటపద్మ ఆస్పత్రులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆస్పత్రులకు ప్రభుత్వం సుమారు రూ.50 కోట్ల వరకు బకాయిలు చెల్లించకపోవడంతో సేవలు నిలిపివేశాయి. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిచ్చేదని, వైద్య భరోసా ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



విజయనగరంలోని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రిలో హెల్ప్ డెస్క్

చిన్నా... లే నాన్నా..

- ఆడుకునేందుకు వెళ్లి అనంత లోకాలకు..
- విద్యుదాఘాతంతో బాలుడి మృతి
- కన్నీరుపెట్టిన తల్లిదండ్రులు
- పంచాయతీ, విద్యుత్‌శాఖ నిర్లక్ష్యానికి బాలుడు బలయ్యాడంటూ బంధువుల ఆరోపణ
- శోకసంద్రంలో ఎస్.పెద్దవలస ఎస్సీ కాలనీ



బాలుడి మృతదేహం వద్ద కన్నీరుపెడుతున్న తల్లిదండ్రులు, బంధువులు

మక్కువ: చిన్నా.. లే నాన్నా... ఆడుకుని వస్తానని చెప్పి అనంత లోకాలకు వెళ్లిపోయావా... అప్పుడే నూరేళ్లు నిండిపోయాయా.. మాతో ఎవరు ఆడుకుంటారు... వేగంగా వచ్చేస్తానన్నావు... మమ్మల్ని విడిచిపెట్టి వెళ్లిపోయావా అంటూ చిన్నారి తల్లిదండ్రులు రోదించిన తీరు అక్కడివారిని కన్నీరుపెట్టించింది. అన్నం పెట్టమ్మా.. తిని కాసేపు ఆడుకొని వచ్చేస్తానంటూ బయటకు వెళ్లిన చిన్నారి విద్యుదాఘాతంతో మృతిచెందడం కుటుంబ సభ్యులు, గ్రామస్తుల్లో విషాదం నింపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

మక్కువ మండలం ఎస్.పెద్దవలస ఎస్సీ కాలనీకు చెందిన కల్లుకోట రమ్య, చందుల కుమారుడు అభీరా(4) శుక్రవారం ఉదయం ఆడుకునేందుకు మరో స్నేహితుడితో కలిసి వెళ్లాడు. రెండు గంటల సమయం దాటినా ఇంటికి చేరుకోకపోవడంతో తల్లి రమ్య వెతకసాగింది. అభీరాతో ఆడుకునేందుకు వెళ్లిన మరో బాలుడిని బిడ్డ ఆచూకీ కోసం ఆరా తీసింది. పాఠశాల వైపు వెళ్లాడని ఆ బాలుడు సమాధానం చెప్పడంతో అటువైపుగా వెళ్లిన ఆ తల్లి పాఠశాల ప్రహరీ పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న బిడ్డను చూసి తల్లడిల్లిపోయింది. కేకలు వేస్తూ బిడ్డను హత్తుకునే ప్రయత్నంలో ఆమెకు కూడా విద్యుత్‌షాక్ తగలడంతో కాలనీ వాసులు రక్షించారు. లేదంటే తల్లి కూడా బిడ్డతో పాటు మృతి చెందేది. కాలనీకి తాగునీరు సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకం విద్యుత్ ప్యానల్‌బోర్డును పాఠశాల ప్రహరీకి అమర్చారు. దాని పక్కనే జామి చెట్టు ఉంది. చెట్టుకాయలు తెంపేందుకు చిన్నారి వెళ్లాడా? లేదంటే అక్కడ ఆడుకుంటుండగా విద్యుత్‌షాక్ తగిలిందో తెలియదు.. విగతజీవిగా కనిపించాడు. కొడుకు మృతిచెందిన విషయం తెలుసుకున్న తండ్రి చందు విశాఖ పట్టణం నుంచి హుటాహుటిన చేరుకున్నాడు. నాన్న, చిన్నా లేవరా.. నాతో ఎవరు ఆడుకుంటారు.. లే..నాన్న అంటూ తండ్రి రోదన అందరి కంట కన్నీరు తెప్పించింది. పోస్టుమార్టం కోసం ఆటోలో తరలిస్తున్న బాలుడిని పట్టుకొని ఆ తండ్రి కన్నీరుమున్నీరయ్యారు.



పోస్టుమార్టం కోసం ఆటోలో తరలిస్తున్న కుమారుడిని చూసి కన్నీరుపెడుతున్న తండ్రి

పంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి బాలుడు బలి?

గ్రామంలో ఎస్సీ కాలనీకు తాగునీరు అందించేందుకు మినీ రక్షిత మంచినీటి పథకం ఏర్పాటుచేశారు. తాగునీరు సరఫరా చేసేందుకు పాఠశాల ప్రహరీకి అమర్చిన ప్యానల్ బోర్డు కింద వైరు పాడవ్వడంతో ప్యానల్ బోర్డుకు విద్యుత్ సరఫరా అవుతోంది. కాలనీ వాసులు నిత్యం కర్రలతో స్విచ్ ఆన్, ఆఫ్ చేసి తాగునీరు పట్టుకుంటున్నారు. ఈ విషయం పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. బాలుడు అభీరా విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ స్తంభంపై ఉన్న వైరును తొలగించి, వారిపై ఎటువంటి అపనింద పడకుండా చేసిన ప్రయత్నాలను కాలనీ వాసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కేసు నమోదుచేసి, బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ప్రమాదానికి కారణమైన ప్యానల్‌బోర్డు

దివ్యాంగులకు మళ్లీ పరీక్ష

- ఏళ్ల తరబడి ధ్రువీకరణ ఉన్నా ఆగని వేధింపులు
- దాగి ఉన్న ప్రభుత్వం కుట్ర


పింఛనును నిలిపివేశారంటూ పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి నిరసన వ్యక్తం చేసిన దివ్యాంగులు(ఫైల్)

పార్వతీపురం రూరల్: పుట్టుకతోనో, ప్రమాదవశాత్తూనో వైకల్యంతో జీవచ్ఛవాలుగా బతుకులు ఈడుస్తున్న విధి వంచితులు వారు. వారికి ప్రభుత్వం పింఛన్ రూపంలో అందించే సాయం గంజినీళ్లకైనా తక్కువే. కానీ ఆ కొద్దిపాటి ఆసరాను అందుకోవడానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారు నిత్యం అగ్నిపరీక్షలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికే ఎస్సార్పు పరీక్షల నిమిత్తం వైద్యుల ఎదుట తమ వైకల్యాన్ని నిరూపించుకున్న వారిని, ఇప్పుడు మళ్లీ పునః పరిశీలన పేరుతో ప్రభుత్వ యంత్రాంగం నరకానికి దారులు చూపుతోంది. మళ్లీ పరీక్షకు రండి అంటూ జారీ చేస్తున్న ఆదేశాలు వారి పట్ల పుండుమీద కారం చల్లినట్లుగా మారాయి. ఈ నెల 14 నుంచి పునపరిశీలన పేరుతో మళ్లీ పరీక్షలు జరగనున్నట్లు 2,484 మందికి హాజరు కావాలని ఇప్పటికే వెలుగు సిబ్బంది ద్వారా సమాచారం ఇచ్చారు. అయితే ఇది సంక్షేమమా? లేక ప్రభుత్వమే దివ్యాంగులను మానసిక క్షోభకు గురిచేయడమా? అని దివ్యాంగులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

అనర్హుల పేరిట పేదలతో అసలైన లబ్ధిదారులకు షాక్

జిల్లా వ్యాప్తంగా అర్హత లేని వారిని ఏరివేసే నెపంతో అధికార యంత్రాంగం చేపట్టిన ఈ పునపరిశీలన ప్రక్రియ, అసలైన దివ్యాంగుల పాలిట శాపంగా మారింది. పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 2,484 మందిని పునపరిశీలన కోసం గుర్తించారు. వారిలో అత్యధికులు 1442 మంది శారీరక వైకల్యం ఉన్నవారే. దేశాలు దమ్ముడి కదలలేని స్థితిలో ఉన్నవారిని సైతం పరిశీలన పేరిట తరలి రావాలనడం ఒక విధంగా ప్రభుత్వ క్రూరత్వానికి నిదర్శనమని దివ్యాంగులు వాపోతున్నారు. దృష్టిలోపం ఉన్నవారు 446మంది, వినికిడి లోపం ఉన్న వారు 511మంది, మానసిక దివ్యాంగులు 85మంది ఈ జాబితాలో ఉన్నారు. వారిలో చాలా మందికి ఏళ్ల క్రితమే జిల్లా ఆస్పత్రుల్లోని వైద్యుల బృందం శాశ్వత వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించి, సదరం సర్టిఫికెట్లు జారీ చేసింది. ఇప్పుడు ఆ పత్రాలకు విలువలేదా? ఆ వైద్యుల నిర్ధారణపై ప్రభుత్వానికి నమ్మకం పోయిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పరిశీలన కేంద్రాల్లో నరకయాతన

గతంలో వైకల్య నిర్ధారణ కోసం జిల్లా కేంద్రాలకు, విజయనగరం వంటి ప్రాంతాలకు ప్రయాణ పడి వెళ్లిన దివ్యాంగులను ఇప్పుడు మళ్లీ పరిశీలన పేరిట పిలవడం వారికి అగ్నిపరీక్షగా మారింది. ఒకే రోజున వారికి కేటాయించిన సంఖ్యలో పరిశీలనకు వచ్చేవారికి గంటల తరబడి నిరీక్షించక తప్పని పరిస్థితులు అక్కడ ఏర్పడుతాయి. ఒకరి సహాయం లేకుండా కదలలేని వారిని ఈ విధంగా పరిశీలన పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ దివ్యాంగులను అవస్థల పాలు చేయడం ఏ మాత్రం సమంజసం కాదని సామాన్యులు సైతం ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ తతంగం మొత్తం టీ అనర్హులను ఏరివేయడం కన్నా, లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకుని ప్రభుత్వ పింఛన్ ఎగవేసేందుకు కుటిల నీతి చేస్తోందన్న విమర్శలు రాజకీయ విశ్లేషకుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి.

దివ్యాంగుల పట్ల ప్రభుత్వ తీరు సరికాదు



దివ్యాంగుల పట్ల పునపరిశీలన పేరుతో ప్రభుత్వ వ్యవహరిస్తున్న తీరు సరికాదు. కనీస మానవతా దృక్పథంతోనైనా ఆలోచించాలి. ఇప్పటికే ధ్రువీకరణ పొందిన శాశ్వత వైకల్యం ఉన్న వారిని ఈ పునపరిశీలన ప్రక్రియ నుంచి మినహాయించాలి. నిజంగా అనర్హులు ఉన్నారని భావిస్తే క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. అంతేగాని ఇష్టానుసారం పరిశీలన పేరిట పరిశీలన కేంద్రాలకు పిలిపించడం ఒక విధంగా రప్పించి కాదని సమర్థనీయం కాదు.

– మల్లు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

క్లుప్తంగా

మానసిక ఆరోగ్యం ముఖ్యం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణ ప్రసాద్

విజయనగరంఫోర్ట్: ప్రతి ఒక్కరికీ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మానసిక వైకల్యం కలిగిన వ్యక్తులకు ఉచిత న్యాయసహాయం అందించనున్నట్లు తెలిపారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి వ్యక్తికి గౌరవంగా జీవించే హక్కు ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి, సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, మానసిక విభాగం అధిపతి డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ముద్దాయిలకు జైలుశిక్ష

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జరిగిన దొంగతనం కేసులో ముగ్గురు ముద్దాయిలకు ఆరు నెలల జైలు శిక్ష పడిందని గరివిడి ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు. గరివిడి పోలీస్‌స్టేషన్ పరిధి కొండపాలెంలో గల బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జూలై 19వ తేదీ 2021వ సంవత్సరంలో దొంగతనం జరిగిందని, ఇందుకు సంబంధించి అప్పట్లో ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జిషీటు కోర్టులో ఫైల్ చేశారని తెలిపారు. ఈ మేరకు తనతో పాటు కోర్టు పోలీస్ కానిస్టేబుల్ సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ కేసులో వాదనలు అనంతరం చీపురుపల్లి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పి.బుజ్జి ముద్దాయిలైన మండల పైడిరాజు, పెద్దిరాజు శ్రీను, గడపర్తి ఆదినారాయణలకు జైలు శిక్ష విధించారని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన ఎరుకు రాజు

గజపతినగరం: మండలంలోని పాత్రికేయగ్రామానికి చెందిన దుక్కా ఎరుక రాజు(52) ఈ నెల 3వ తేదీన ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. ఈ మేరకు ఆయన భార్య దుక్కా రామలక్ష్మి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు శుక్రవారం రాత్రి ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు చెప్పారు.

బావిలో యువకుడి మృతదేహం


ఎంకల రాము(ఫైల్)

చీపురుపల్లి: మండలంలోని పుర్రేయవలస సమీపంలోని ఓ బావిలో యువకుడి మృతదేహం లభించింది. ఆ యువకుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించాడా లేక ఏదైనా మిస్టరీ ఉందా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పత్తికాయవలస పంచాయతీ మెరకముడిదాం గ్రామ మైన ముగిడిపేట గ్రామానికి చెందిన ఎంకల రాము(26) పుర్రేయవలస సమీపంలో ఇటుకల తయారీ కేంద్రంలో పొక్లెయిన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇటుక తయారీ కేంద్రంలో విధులు ముగించుకుని ఇంటికి బయల్దేరాడు. అదే రోజు రాత్రి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. దీంతో రాము యజమాని వద్దకు వచ్చి వాకబు చేశారు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని రాము ఇంటికి బయల్దేరాడని యజమాని చెప్పడంతో అప్పటి నుంచి వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పుర్రేయవలస సమీపంలో ఇటుకల తయారీ కేంద్రం వద్ద ఉన్న నేలబావి వద్ద చెప్పులు కనిపించడంతో బావిలో చూడగా రాము మృతదేహం కనిపించింది. కుటుంబ భారమా లేక ఇతర కారణాలు ఉండి ఆత్మహత్య చేసుకున్నాడా అన్న కోణంలో పోలీసులు భావిస్తున్నారు. తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎల్.దామోదరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చే నెల 22 నాటికి కోటి సంతకాల సేకరణ పూర్తి

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్యక్రమాలు
- జగన్ పర్యటన విజయవంతంపై అందరికీ కృతజ్ఞతలు
- ఉత్తరాంధ్ర నేతలతో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు టెలికాన్ఫరెన్స్

సాక్షి, విశాఖపట్నం: నర్సీపట్నంలో వైద్య కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9వ తేదీన చేపట్టిన పర్యటనను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, ప్రజలకు ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ నాయకులతో శుక్రవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి పార్టీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. నవంబర్ 22వ తేదీలోపు కోటి సంతకాల సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ నియోజకవర్గంలో 50 నుంచి 60 వేల సంతకాల సేకరణ చేపట్టాలని, ప్రతీ గ్రామంలో 500 సంతకాలు తగ్గకుండా చూడాలని సూచించారు. ఈ నెల 28వ తేదీన ప్రతీ నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం చేపట్టాలన్నారు. సంతకాల సేకరణ ప్రక్రియను నవంబర్ 22వ తేదీకి పూర్తి చేసి 23న ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు ఈ ప్రతులను పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపించాలన్నారు. నవంబర్ 26న పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ముఖ్యనేతలు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి వీటిని అందజేస్తారన్నారు. సోషల్ మీడియా వేదికగా ఈ విస్తృత కార్యక్రమాన్ని ప్రచారం చేయాలని, ఆ బాధ్యత సోషల్ మీడియా యాక్టివిస్టులు తీసుకోవాలని సూచించారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ఉపసంహరించుకునే వరకూ పోరు ఆపకూడదన్నారు. జిల్లా, మండల, గ్రామ అనుబంధ విభాగాల కమిటీల నియామకం కూడా నవంబర్ 22 నాటికి పూర్తికావాలన్నారు. అలాగే కల్తీ మద్యంపై వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. టెలికాన్ఫరెన్స్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రైతుపై టీడీపీ వర్గీయుల దాడి

- అత్యవసర వైద్యం కోసం విజయనగరం తరలింపు


చికిత్స పొందుతున్న ఆదినారాయణ

చీపురుపల్లి: అధికార పార్టీ అండతో టీడీపీ వర్గీయులు ఇష్టారాజ్యంగా దాడులకు తెగబడుతున్నారు. పంట పొలాల్లో వచ్చిన తగాదాలపై అక్కడితో ఆగకుండా ఇళ్లకు వెళ్లి మరీ దాడులకు పాల్పడుతున్నారు. సరిగ్గా ఇదే సంఘటన చీపురుపల్లి మండలంలోని నిమ్మలవలస పంచాయతీ మధుర గ్రామమైన గుణిదాంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి గాయపడిన బాధితుడి కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుణిదాం గ్రామానికి చెందిన గంట బోయిన ఆదినారాయణకు ఎర్ర సురేష్‌కు మధ్య పొలంలో గట్టు వివాదం నెలకొంది. పొలంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగిన అనంతరం సమసిపోయింది. అయితే టక్క పెట్టుకున్న ఎర్ర సురేష్, మరికొంత మందితో కలిసి కత్తులు, రాడ్లతో అధికార పార్టీ అండతో సాయంత్రం గండబోయిన ఆదినారాయణ ఇంటికి వెళ్లి విచక్షణ రహితంగా దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ఆదినారాయణ తలపై తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో ఉన్న ఆదినారాయణను కుటుంబ సభ్యులు చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు అత్యవసర చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయితే ఈ వివాదంలో తమకు గాయాలయ్యాయంటూ ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.దామోదరరావు చెప్పారు.

తండ్రిని చంపిన కేసులో తనయుడి అరెస్టు


హత్యకేసు నిందితుడితో డీఎస్పీ భవ్యరెడ్డి, సీఐ నారాయణరావు, ఎస్సై తారకేశ్వరరావు

బాడంగి: మండలంలో సంచలనం రేపిన తండ్రిని చంపిన తనయుడి హత్యకేసును పోలీసులు ఛేదించారు. తండ్రి హత్యకు కారణమైన కుమారుడు బొసుగిరి లక్ష్మణరావును శుక్రవారం అరెస్టుచేసి రిమాండ్ నిమిత్తం బొబ్బిలి కోర్టుకు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ భవ్యరెడ్డి విలేకరులకు వెల్లడించారు. మద్యానికి బానిసగా మారి డబ్బులకోసం తరచూ తండ్రితో లక్ష్మణరావు గొడవ పడుతుండేవాడని చెప్పారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం సేవించేందుకు డబ్బులివ్వాలని అడగ్గా తండ్రి నిరాకరించడంతో చెప్పులు లేకుండా తాగేందుకు మీ తండ్రి చెప్పడంతో చెప్పుల మేకులు చెరిచే గూటంతో గురువారం తెల్లవారుజామున తండ్రి రామకృష్ణరావు కు దెబ్బలు తగిలే విధంగా కొట్టడంతో రక్తస్రావం జరిగి తండ్రి అక్కడికక్కడే మృతి చెందినట్టు చెప్పారు. నిందితుడిని పిన్నవలస జంక్షన్‌లో పట్టుకుని అరెస్టు చేశామని తెలిపారు. బొబ్బిలిరూరల్ సీఐ నారాయణరావు, ఎస్సైతారకేశ్వరరావుల కృషిని ఆమె అభినందించారు.

పెదమానాపురం గ్రామస్తుల ధర్నా


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న పెదమానాపురం గ్రామస్తులు

- ఆర్‌ఓబీ పూర్తవడంతో రాకపోకలకు ఇబ్బందులు
- కిలోమీటర్ నడిచి బస్సులు ఎక్కాల్సి వస్తోందని ఆవేదన
- అండర్‌గ్రౌండ్ వంతెన నడుపాయం కల్పించాలని విజ్ఞప్తి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం గ్రామస్తులకు రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో శుక్రవారం ఉదయం పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై గ్రామస్తులు అంతా కలిసి ధర్నా నిర్వహించారు. కిలోమీటర్ మేర వాహనాలను నిలుపుదల చేసి వారు పడుతున్న బాధలను తెలియజేశారు. అనంతరం సీఐటీయూ నాయకులు లక్ష్మితో కలిసి గ్రామస్తులు కనకరాజు, రామప్పలనాయుడు, ఆదినారాయణ, పైడిరాజు, సత్యారావు, సంజీవి, వెంకటరమణ, రాజేష్, రాములునాయుడు మాట్లాడుతూ పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే కష్టంగా ఉందని కిలోమీటర్ దూరం నడిచి వచ్చినా బస్సులు ఆపడం లేదని, ఎరువులు పట్టుకుని పొలాలకు వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని వాపోయారు. తక్షణమే అధికారులు దృష్టి సారించి అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెద్దమానాపురం గ్రామానికి చెందిన జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి మాట్లాడుతూ ఇబ్బందులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామం నుంచి కిలోమీటర్ దాటి వెళ్లినా బస్సులు ఆపక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రాత్రి సమయంలో పోలీస్‌స్టేషన్ దాటి బస్సులు ఆపడం వల్ల ఎవరికి ఏ అపాయం జరుగుతుందోనని ఆందోళనలో ఉన్నామన్నారు. పెదమానాపురం గ్రామస్తులు దత్తత తీసుకున్నామని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్న స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తక్షణమే స్పందించి గ్రామస్తులకు దారి చూపించాలని కోరారు.

పత్తి రైతు నష్టపోకుండా చూడాలి

- జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్

విజయనగరంఫోర్ట్: జిల్లాలోని ఏ ఒక్క పత్తి రైతూ నష్టపోకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పత్తి కొనుగోళ్లపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి రైతు సాగు చేసిన పంటను కచ్చితంగా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పత్తికి మద్దతు ధర ప్రభుత్వం క్వింటాకు రూ.8,110 నిర్ణయించిందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కిసాన్ మొబైల్ యాప్‌ను రైతులు ముందుగా డౌన్ లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. సమావేశంలో మార్కెటింగ్ ఏ.డి బి. రవికిరణ్, డీఎస్ఓ రాంప్రకాష్, మెరకల్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్షంలో జీవనం సాధ్యమే

- శ్రీహరికోట షార్ డీడీ పి.శ్రీనివాసరావు


ధృవపత్రాలతో విద్యార్థులు,నిర్వాహకులు


నమూనాతో నిర్వాహకులు

బొబ్బిలి: మన ప్రయోగాలు, పరిశోధనల సారాంశం సరికొత్త దశలో వెళ్తోందని, ఇప్పుడు అంతరిక్షంలో ప్రయాణానికి కాదు అక్కడ మానవ జీవనమూ సాధ్యమేనన్న రీతిలో సరికొత్త ఆవిష్కరణలు భవిష్యత్తులో జరగనున్నాయని శ్రీహరి కోట మూడవ లాంచ్ ప్యాడ్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీనివాస రావు అన్నారు. గడిచిన మూడు రోజులుగా స్థానిక రాజా కాలేజీలో ఇస్రో ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అంతరిక్షంలో మన ప్రయోగాలు, పరిశోధనల విషయమై స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ తొలిసారి చంద్రమండలంపై అడుగుపెట్టినప్పుడు చెప్పిన ఈ చిన్న అడుగే పెద్ద ముందడుగుగా మారుతుందన్న మాటలు ఇప్పుడు నిజమవుతున్నాయన్నారు. మనదేశం కూడా ఈ రంగంలో అసాధారణ ప్రయాణం చేస్తోందన్నారు. 1969లో చిన్న ఆఫీసులో ప్రారంభమైన ఇస్రో ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత నమ్మదగిన అంతరిక్ష సంస్థల్లో ఒకటిగా నిలిచింది. మన చంద్రయాన్ మిషన్లు చంద్రుడిపై నీటి ఆనవాళ్లు కనుగొన్నాయని తెలిపారు. మంగళయాన్ మిషన్ రెడ్ ప్లానెట్ చేరిన మొదటి ఆసియా దేశంగా మన దేశాన్ని ముందు నిలిపిందన్నారు. ఆదిత్య-ఎల్1 ఆదిత్య సూర్యుడ్ని పరిశీలిస్తూ భూమిని రక్షించే కీలక ఉపగ్రహంగా నిలిచిందన్నారు. ఇప్పుడు గగన్‌యాన్ ద్వారా మన దేశ అంతరిక్ష ప్రయాణానికి సిద్ధమవుతోందన్నారు. భూమి సహాయం లేకుండా అంతరిక్షంలో శ్వాస తీసుకోవడం, నీరు తాగడం, ఆహారం పండించడం, శక్తిని ఉత్పత్తి చేయడం వంటి ఎన్నో పరిశోధనలు త్వరలో చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. భారత దేశానికి స్వంత అంతరిక్ష కేంద్రం (భారతీయ అంతరిక్ష కేంద్రం)2040 నాటికి సాధ్యపడుతుందన్న భావన వ్యక్తం చేశారు. ఇందుకోసం మన దేశం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రాజా కళాశాల చైర్మన్ ఆర్‌వీఎస్‌కే రంగారావు మాట్లాడుతూ కాలేజీలో చేపట్టిన ప్రదర్శనలు, ప్రయోగాల నమూనాల ఆధారంగా ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రయోగాల్లో వాటికి సంబంధించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇస్రో నిర్వాహకులు బి.హరిక్రిష్ణ, ఈ ప్రదీప్‌నాయుడు, ప్రిన్సిపాల్ సీహెచ్ వీరేంద్రకుమార్, అధ్యాపకులు, వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన ఉపాధ్యాయురాలు కనకలక్ష్మి


నెల్లిమర్ల రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్మహత్యకు పాల్పడింది. నెల్లిమర్ల మండలంలోని మొయిద గ్రామంలో గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనపై ఎస్సై గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కవల కనకలక్ష్మి (42) గుర్ల మండలంలోని పెనుబర్తి ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. సుమారు పదేళ్ల నుంచి పక్షవాతం సమస్యతో ఆమె బాధపడుతున్న నేపథ్యంలో మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. బయటకు పొగలు రావడంతో గమనించిన స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా కుర్చీలో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గమనించి 108కు సమాచారం అందించారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త నక్కిన శ్రీనివాసరావు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగానే పనిచేస్తున్నారు. వారికి ఒక కుమార్తె ఉంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్ శుక్రవారం తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు

కొత్తవలస: మండల కేంద్రంలోని సబ్బవరం రోడ్డులో ఒక వీధిలో మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు వంద రూపాయల కోసం వివాదం పడగా కత్తితో దాడి చేసిన ఘటనలో రవితేజ అనే వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఎస్.షణ్ముఖరావు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 7వ తేదీన సూరిశెట్టి రవితేజ, జంగంపల్లి ప్రసాద్ కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ నుంచి రవితేజ వంద రూపాయలను లాక్కున్నారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం ఏర్పడి ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. ఈ క్రమంలో కూరగాయలు కోసే కత్తితో ప్రసాద్‌ను బలంగా రవితేజ పొడిచి తీవ్రంగా గాయపర్చాడు. స్థానికులు విడిపించగా ప్రసాద్ కుటుంబసభ్యులు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రవితేజను రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

దీపావళిలోగా పదోన్నతులు ఇవ్వాలి

- ఏపీపీటీడీ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు


మాట్లాడుతున్న ఏపీపీటీడీ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

విజయనగరం అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ప్రభుత్వం జాప్యం కొనసాగిస్తోందని, దీపావళి పండుగలోగా పదోన్నతుల జీఓ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి దిగుతామని ఏపీపీటీడీ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్రప్రధాన కార్యదర్శి జీవీనరసయ్య హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల ఆధ్వర్యంలో జరిగిన జోనల్ కౌన్సిల్ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీ విలీనమై ఆరేళ్లు గడిచినా ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ జరపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసిస్టెంట్ మెకానిక్ నుంచి అసిస్టెంట్ మేనేజర్ వరకు అలాగే డిపో మేనేజర్ నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరకు ఉన్న ఖాళీలను నింపే ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికి పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6 వేల మంది ఉద్యోగులు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారని దీపావళి పండుగ వరకు సమస్య పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీనరసయ్య మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది తక్కువ, బస్సులు తక్కువ, అదే ప్రయాణికుల సేవల నేపథ్యంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిపై ఒత్తిడి తీవ్రంగా ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం విజయవంతం కావాలంటే కనీసం మరో 3 వేల కొత్త బస్సులు, 10 వేల కొత్త నియామకాలు అవసరమన్నారు. లేకుంటే మరి కొద్దిరోజులకు డ్రైవర్లు, కండక్టర్లు అనేకమంది ఆరోగ్య సమస్యలతో సిక్ లీవ్‌లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నంద మూరి రామారావు, జోనల్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి రవికిశోర్, వివిధ డిపోల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

చికెన్		బ్రాయిలర్
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹147	₹264	₹274